# తల్లిమనసు

సత్యవాణి ఆఫీసులో టైపుచేసిన కాగితాలకు పిన్నుగుచ్చి డ్రాయరులో ఒక పక్కగా పెట్టింది. ఇంకా టైపుచేయవలసినవి డ్రాయరులో మరొక పక్కగా పెట్టింది టైపుమెషీనుమీద మూతపెట్టిలేచింది.

ఆమె చుట్టూ కలయజూసేసరికి కుర్చీలన్నీ ఖాళీగాకనబడ్డాయి. అర్జంటని బాస్ చెప్పిన కాగితాలు సగానికిపైగా మిగిలిపోయాయి. "రేపు మధ్యాహ్నానికయినా వాటిని పూర్తి చెయ్యాలి" అనుకుంటూ ఆమె బుట్ట సర్దుకుని బయలుదేరింది.

ఆఫీసు బిల్డింగ్సన్నీదాటి, గేటుబయటికివచ్చేసరికి బస్సు కదలబోతున్నది. అప్పటికే ఫుట్‌బోర్డుమీద నలుగురయిదుగురు నిలబడ్డారు. వాళ్ళల్లో తానొకతెగా ఎక్కి కడ్డీపట్టుకుని నిలబడ్డది.

బస్సు ఎక్కగానే ఇల్లూ పిల్లలూ జ్ఞాపకానికివచ్చారు. ఇంకొక గంటయితే గాని తను ఇల్లు చేరుకోలేదు. అప్పుడే ఆరుగంటలయింది. పిల్లలీపాటికి ఇంటి ముందర పిల్లలతో ఆడుకుంటూ ఉంటారు. గబగబా వాళ్ళకు పాలపొడితో పాలు కలిపి ఇచ్చి వంటచెయ్యాలి. అపూకి ఏడుగంటలకే నిద్రవస్తుంది. అన్నం కడుపులో పడగానే ఫణికీ నిద్రవస్తుంది. కాని-హోంవర్కు చేయించిన తరువాతనే నిద్రపోనివ్వాలి. ఇప్పటికేవాడు రోజూ చివాట్లుతింటున్నాడు. హోంవర్కు విషయంలో.

ఫణి చిన్నవాడు. నిండా ఆరేళ్ళులేవు. కళ్ళు మూసుకుపోతుంటే లెక్కలు చెయ్యలేక తడబడతాడు. కాపీరైటింగ్ సరిగా రాయలేడు. ఒక అక్షరానికొకటి రాస్తాడు.

తన కివతల వంటకావాలి. వంటచేస్తూ గది ఊడ్చి పక్కలు వెయ్యాలి. ఇవాళ రేపూ గడిస్తే ఎల్లుండి సెలవు" అనుకుంటోంది.

బస్సులో ఎక్కినవాళ్ళు దిగుతున్నకొద్దీ జనం ముందుకు సర్దుకుంటున్నారు. తనుకూడా లోపల ఒక సీటుమీదకూర్చుంది సత్య-సీటుకానుకుని కూర్చోగానే కళ్ళు మూతలుపడ్డాయి.

తెల్లవారి ఐదుగంటలకులేస్తేగాని అంట్లగిన్నెలు కడుక్కుని నీళ్ళు కాగ బెట్టుకుని స్నానంచెయ్యటం, వంటచేస్తూ ఇల్లూడ్చుకోవటం, పిల్లలకు అన్నం పెడుతూ ఆయనకు స్నానానికి నీళ్ళందించటం వంటిపనులుకావు.

అప్పుడు సుందర్రావులేచి ముఖంకడిగి కాఫీ అంటూవస్తాడు. రెడీగాఉంచిన కాఫీగ్లాసు చేతికందిస్తే తాగి "స్నానానికి నీళ్ళుపెట్టు" అంటూ ఆర్డరుచేసి వెళ్తాడు. అతడికి అన్నవేళకు అందించాలి. లేకపోతే మరొక వార్నింగ్ఇస్తాడు. చేతిలో ఉన్నపని ఆపుకుని నీళ్ళు పెడుతుంది. అతడికి భోజనంలోకి తప్పకుండా కూర కాక, పచ్చడీ, సాంబారుఉండాలి. తనకూ పిల్లలకూ మధ్యాహ్నం టిఫిన్‌కని చపాతీలుకావాలి. పిండికలిపిన వెంటనే సుందర్రావు భోజనానికి అన్నీ సిద్ధంచేసి, స్టౌమీద రొట్టెలుచెయ్యటం మొదలు పెడుతుంది.

వాళ్ళున్నఇల్లు నాలుగుభాగాల యిల్లు. మధ్యగా నూరుగజాల ఖాలీస్థలం ఉంది. ప్రతి ఇంట్లోనూ ముగ్గురు నలుగురూ పిల్లలున్నారు. అందరూ? ఒకే స్కూలుకు వెళ్ళట మొక గొప్పసౌకర్యం. రోడ్డుదాటాలి సంచులు బుజాలకు తగిలించుకుని, పిల్లలు టిఫిన్ డబ్బాలు పట్టుకుని, ఒకరిచేతులొకరు పట్టుకుని మెల్లగా నడిచివెళ్తారు. అప్పుడప్పుడు చిన్న పిల్లలను పెద్ద పిల్లలు "తొందరగా నడవండి గంటకొట్టేస్తారు" అనగానే పరుగెత్తుతారు.

పిల్లలువెళ్ళిన తరువాత తనూ సుందర్రావు భోజనాలకు కూర్చుంటారు. అతడు చేత పేపరుపట్టుకుని చదువుతూ, భోజనంచేస్తాడు. మళ్ళీ వచ్చిన తరువాత యినా-తనే చేసుకోవాలికదా అని అయినంతవరకూ ఇల్లు శుభ్రంచేసి తన బుట్టలో టిఫిన్‌డబ్బా కాఫీ ఫ్లాస్కు సర్దుకుని, జిడ్డు ముఖాన్ని కడుక్కుంటుంది. చీరె మార్చుకుని చెప్పులు తీసుకుందామనిచూస్తే తెగిపోయినచెప్పు కంటికెదురుగా కనబడుతుంది. "ఈ చెప్పు కుట్టించటానికి టైము దొరకటంలేదు. రేపయినా కుట్టిం చాల"ను కుంటూ డూప్లికేటు తాళంచెవి పర్సులో వేసుకుని బయలుదేరుతుంది బస్సుకోసం.

ఇది ఇంచుమించుగా సత్య దినచర్య. ఏ నిమిషాని కానిమిషం పనిఎదురుగా కనిపిస్తూంటుంది.

సత్య మధ్యలో కళ్ళుతెరిచి చూసేసరికి తను దిగవలసిన స్టాపు కోసం బస్సు మెల్లగానడుస్తోంది. అప్పుడే కొందరు తొందరపడి దిగిపోతున్నారు. బస్సు ఆగగానే సత్య బుట్ట చేతబట్టుకుని చీరె సర్దుకుని దిగింది.

ఇంటికి వెళ్ళగానే కూరలకు వెతుక్కోవాలని దారిలోనే రెండు పూటలకు సరిపడా కొని, ఇంటిదారిపట్టింది. ఇల్లు దగ్గరవుతున్నకొద్దీ పుట్టెడుభయం. బట్టలు కూడా పిండుకోవాలి. పొద్దున చేయాల్సినపని అప్పుడు టైం చాలలేదు.

తల్లిని గుమ్మందగ్గర చూడగానే "అపూ అమ్మవచ్చింది దాదా" అంటూ ఫణి చెల్లెలిని తీసుకువచ్చాడు.

ఆమె తలుపుతాళం తియ్యగానే "అమ్మా బిస్కెట్లు బిస్కెట్లు" అంటూ కొంగుపట్టుకున్నారు.

"అబ్బ, మనిషికి ఊపిరాడనివ్వరు. గడపలోకాలు పెట్టగానే బిస్కెట్లంటూ గోల. కాస్త ఆగలేరు?" కొంగువిదిలించుకుని ఇద్దరిచెంపలూ వాచేటట్టు కొట్టింది.

పిల్లలిద్దరు గొల్లున ఏడుస్తూ చెరొక మూలా నిలబడ్డారు వెక్కుతూ.

ఆవేశంతోకొట్టి, బాత్‌రూమ్‌లో ముఖం కాళ్ళూ చేతులూ కడుక్కునివచ్చి, పాలపొడితో తయారుచేసినపాలు బిస్కెట్లూ తెచ్చి బల్లమీద పెట్టి "రండర్రా పాలు పెట్టాను" కేక పెట్టింది.

పగలంతా పిల్లలతో స్కూల్లో గడిపిన అపూ ఫణి బిక్కముఖాలతో బల్ల దగ్గరికొచ్చి నిలబడ్డారు.

"నిలబడ్డారేం? పాలుతాగి బిస్కెట్లుతినండి. రాగానే కొంగుపట్టుకుని పీకేశారుగా? ఒక్కనిమిషమయినా నిలవనీయకుండా?"

అంటూ లోపలికెళ్ళింది తను కాఫీ తాగి సుందర్రావుకు కాఫీ ఫ్లాస్కులో పోసింది. ఆ బట్టలు నాలుగూపిండి ఆరవేస్తే వంట మొదలుపెట్టవచ్చనుకుంది.

ఆకలివేసిన అపూ గబగబా పాలుతాగి బిస్కెట్లుతింటూ కిటికీదగ్గర నిల

బడ్డది. కాని-ఫణికి కాస్త బుద్ధి తెలుస్తున్నది. తల్లి కొట్టినందుకు రోషం అభిమానం ముంచుకువచ్చాయి. పట్టుదల పెరిగింది. బల్లదగ్గర అట్లాగే నిలబడ్డాడు.

సత్య బట్టలుపిండి నీళ్ళగదిముందర తీగమీద ఆరవేసింది. కూరలు తర గాలని అటుగావచ్చిచూస్తే, ఫణి అట్లాగే నిలబడిఉన్నాడు.

''ఏం అట్లా నిలబడ్డావు? పాలు తాగించి బిస్కెట్లు నోట్లోపెట్టాలా? ఈ సాగతీయడాలు నాకు చేతకావుబాబూ!'' అంటూ తన పని చూసుకోవటానికి వెళ్ళింది.

అంతలో సుందర్రావువచ్చాడు రాగానే కాఫీగ్లాసు చేతిలోకితీసుకున్నాడు. పక్కకు తిరగ్గానే బల్లముందు ఫణి కన్నీటిచారలతో వెక్కుతూ నిలబడటంచూసి "ఫణీ ఇంత ఆలస్యమయిందేం పాలు తాగటానికి? ఎక్కడయినా పడ్డావా?" అడిగాడు.

ఈ కాస్త మాటకే ఫణికి ఏడుపు ముంచుకుంటూ వచ్చి బిగ్గరగా ఏడ్చేశాడు.

"ఏడు పెందుకు? పాలుతాగు నీవుబిస్కెట్లుతింటూ నా పక్కన కూర్చుంటే నేను కాఫీ తాగుతాను. దామరి" చెయ్యిపట్టుకుని దగ్గరగా కూర్చోబెట్టుకున్నాడు.

"చూడు నాన్నా అమ్మేమో పాలు బిస్కెట్లు, రాగానే అడిగితే మమ్మల్ని కొట్టింది." అన్నాడు కళ్ళుతుడుచుకుంటూ.

"అపూ తిన్నదా?"

''కాసేపు ఏడ్చి తిన్నది''

ఎర్రగా కందిపోయిన బుగ్గలను చేత్తోనిమురుతూ ''పాలు తాగుముందు'' అంటూ పాలు తాగంగానే పిల్లలిద్దరినీ గాలికి బైటికి పార్కులోకి తీసుకువెళ్తా నన్నాడు.

సత్య గబగబా వంటచేసి, ఇల్లు ఒకసారిఊడ్చి పక్కలు దులిపివేసింది.

అప్పటికి ఎనిమిది కావచ్చింది. చల్లగాలికి వాకిలితలుపు తెలుచుకుని కూర్చుంది.

సత్య కానాడెందుకో చికాకుగా ఉంది. పనిమనిషి రావటం లేదు. వేళకు ఇంట్లోపనులు కావటం లేదని తెల్లవారకుండానే లేస్తుంది. వేళకు ఆఫీసుకు వెళ్ళాలనీ, ఎవరిచేతా ఏమాటా అనిపించుకోకుండా తన పని తొందరగా చేసుకుపోవాలన్న ఆదుర్దాతో ఉంది.

తనకు టైపు చెయ్యటంలో స్పీడ్ బాగానే ఉంది. కాని, ఎందుకో ఈ రోజున స్పీడందుకోలేక పోయింది. ఆ ఉదయం సుందర్రావు ''ఎప్పుడూ ఒకటే కూర చేస్తావ"ని విసుక్కుంటూ అన్నం పక్కకు నెట్టివేశాడు. అతడు భోజనం విషయంలో కొంచెమయినా సర్దుకోడు. రోజూ సెలెక్టెడ్‌గా కూరగాయలు దొరుకుతాయా ? దొరికినవయినా చేయటానికి టైముండాలా ? ఇదేమీ ఆలోచించడు.

తను వంటచేసుకుంటూ ఉండగా ఏడేళ్ళయినా లేని ఫణి తనే స్వయంగా స్నానం చేస్తాడు. తన యూనిఫారమ్ వేసుకుని బూట్లు వేసుకుంటాడు. అద్దం ముందర నిలబడి తల దువ్వుకుంటాడు. ఐదో ఏడు చెల్లెలికి. తల్లి నీళ్ళుపోస్తే తను బట్టలు చూసి వేస్తాడు, బూట్లు వేస్తాడు. కత్తిరించిన వెంట్రుకలు కనుక, తనే తలదువ్వి క్లిప్పు పెడతాడు. టిఫిన్‌డబ్బాలు బల్లమీద సిద్ధంగా ఉంచుతాడు. వాడి చురుకుదనం చూసి తనే ఆశ్చర్యపడుతుంది. పిల్లలు తమపనులు తాము చేసుకోవటం నేర్చుకుంటున్నారన్న సంతోషము తృప్తిచెందుతుంది.

రోజూ ఆఫీసునుంచి రాగానే ఆడుకుంటున్న వాళ్ళను పిలిచి ముద్దులు పెట్టించుకుని, పాలు కలిపి తాగిస్తుంది. బిస్కెట్లు చేతికిస్తుంది.

కాని ఇవాళ ఏంచేసింది ? తన చికాకంతా వాళ్ళమీద చూపించింది. ఇద్దరినీ బిస్కెట్లడిగినందుకు గాను బుగ్గలు కందిపోయేటట్లు చెంపలు వాయించింది ఆవేశంతో.

తను అనుకున్నదొకటి, జరుగుతున్న దొకటీను. పెళ్ళినాటికి ఉద్యోగం చేస్తున్న సుందర్రావు నాలుగు రూపాయలయినా వెనకవెయ్యలేదు. తనకు వచ్చిన కట్నకానుకలతో చెల్లెలి పెళ్ళి చేయించాడు. తండ్రి పంచి యిచ్చిన నాలుగువేల రూపాయల అప్పుతో ఆ ఊరు వచ్చాడు. చేసింది ప్రైవేటు ఉద్యోగం. మాటా మాటా వచ్చి ఉద్యోగం వదులుకున్నాడు. మళ్ళీ ఆరు నెలలకుగాని మరొకటి దొరకలేదు. అదీ తక్కువ జీతం. ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయి. కాని అలవాట్లు మారలేదు.

సత్య కాన్త ఉన్నయింట్లో పుట్టి బియ్యే ప్యాసయి టైపు షార్ట్‌హాండు నేర్చుకుంది. పెళ్ళినాటికి. ఆడపిల్లలెక్కువగా ఉన్న ఆ యింట్లో పెద్దపిల్ల. అందుకే మొదటిపిల్ల పెళ్ళి అని ఘనంగానే చేశారు.

తీరా కాపరం పెట్టవచ్చేసరికి తన మొదటికాన్పు పిల్లవాడికి రెండేళ్ళు వెళ్ళాయి. సుందర్రావు చేస్తున్న ప్రైవేటు ఉద్యోగం ఊడిపోయింది.

అప్పుడు తను ఉద్యోగప్రయత్నం మొదలుపెట్టింది.

"అనుభవం ఉన్న నాకు దొరకలేదు గాని, నీకు దొరుకుతుందా ?'' నిరుత్సాహపరిచాడు.

''చూద్దాం, వస్తే మంచిదే. రాకపోతే నష్టంలేదు'' అన్నది. కాని తెలిసిన వాళ్ళ సహాయంతో ఈ ఉద్యోగాన్ని సంపాదించింది. అప్పటికి చిన్నపిల్లవాడు కాక మరొక పాప పుట్టింది.

ఇరుగు పొరుగుల సహాయంతో, తనకు తనే ధైర్యము తెచ్చుకుంటూ బాధ్యతలేని భర్తతో వేగుతూ కాలం గడుపుతోంది.

పని పంచుకోకపోయినా ఖర్చులయినా సహచరుడు పంచుకుంటే కొంత బాధ్యత తగ్గుతుంది. కాని, అతడు ఉద్యోగం చేస్తున్నాడో లేదో తెలియదు. ఉదయం భోజనంచేసి బైటికి వెళ్తాడు, సాయంత్రం వస్తాడు.

ఇప్పుడామె ఆ విషయం ఎత్తదు. పిల్లలకు స్కూలుకు వెళ్ళే వయసు వచ్చింది. స్కూల్లో చేర్పించింది.

కాలం సాగిపోతున్నది.

ఇవాళ గంపెడు చికాకుతో యింటికి వచ్చి ఎన్నడూ ఒక దెబ్బయినా వెయ్యని పిల్లల చెంపలు వాయించింది.

బిడ్డలంటే దైవస్వరూపాలు.

దాంపత్యంలో పండిన ఫలాలు.

పసితనంలో పిల్లలకు తల్లిప్రేమ ఆప్యాయత ఎంతముఖ్యమో తను బాగా తెలిసిన మనిషి. పిల్లల హృదయాలు ఎంత సున్నితంగా ఉంటాయో అంతకంటె

సున్నితంగా తల్లి వాళ్ళపట్ల ప్రవర్తించాలి. పిల్లలను కనగానే సరికాదు- ప్రతి నిమిషమూ మరిచిపోలేని ఆదరణ అందించగలగాలి. వాళ్ళ హృదయాలప్పుడే సుసంపన్న మవుతాయి.

కాని, అంతాతెలిసి ఆవేశంలో తను మామూలు మనిషిగా ప్రవర్తించిం దివాళ.

తనలో ఇంతటి పశుత్వం దాగిఉన్నదా "ఛీ, ఛీ, తనూ ఒక తల్లేనా ?"

పిల్లలకంటె ఎక్కువా ఈ ఉద్యోగం ? దీని వలనే వాళ్ళకు తన ఆప్యాయతనూ, కన్నతల్లి ప్రేమనూ తగినంతగా అందివ్వలేక పోతున్నది ?

దీనిని వదిలిపెట్టితే ?

వెంటనే వెన్నుపొడుగునా ఏదో పాకినట్లయింది.

రానున్న నెల నోరుతెరచుకున్న రాక్షసిలా కనబడ్డది.

అవును, తను ఉద్యోగం మానకూడదు. పిల్లలకు రెక్కలు వచ్చేవరకూ పెంచాలి. కన్నతల్లిగా అది తన బాధ్యత.

అయితే ఇవాళ చేసిన తప్పు మళ్ళీ చెయ్యకూడదు. అందుకు తనకు తనే శిక్ష విధించుకోవాలి. గాంధీమహాత్ముడు తను చేసిన తప్పులకు కాక, ఇతరులు తప్పులు చేసినప్పుడల్లా ఉపవాసం చేసేవాడు. జాతీయోద్యమంలో ఆయన లెక్కలేనన్ని ఉపవాసాలు చేశాడు.

ఆయన మహాత్ముడు. ఆయన ఉపవాసాలకు ఎంతో విలువ ఉంది. తప్పు చేసిన వాళ్ళు తమతప్పులను తెలుసుకుని దిద్దుకున్నప్పటికీ ఆ తప్పుకు చిహ్నంగా తను ఉపవాసముండే వాడు. ఆ విధంగా జాతిని తీర్చిదిద్దాలని ఆయన సంకల్పం.

సత్య లేచింది, పిల్లలిద్దరూ పార్కుకు వెళ్ళారనుకుంది. పక్కయింట్లో ఉన్నారు. రాగానే ఆదరంగా పిలిచి భోజనాలు పెట్టింది.

''మీరు పార్కుకు వెళ్ళలేదూ ?"

"లేదమ్మా, పక్కింట్లో ఉన్నాం."

''నాన్న పార్కుకు తీసుకెళ్ళలేదూ ?"

"లేదమ్మా మమ్మల్నే వెళ్లమన్నారు."

"అలాగా ! సరే, ముందు భోజనాలు చేయండి. హోంవర్కు చెయ్యాలి నిద్రపోయేముందు.''

''సరేనమ్మా," తల్లి చల్లటి మాటలతో భోజనాలు చేసి హోంవర్కు చేశారు. తల్లి పక్కన పడుకుని ఆమె కథలు చెబుతుంటే నవ్వుతూ దొర్లిదొర్లి నిద్ర కొరిగారు.

తెల్లవారి లేచిన పిల్లల ముఖాలు తేటగా ఉన్నట్టు కనబడ్డాయి. సత్య గుండెలోని భారం తగ్గి తేలికపడ్డది.

మరునాడు ఆమె నీరసంతో కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకు వెళ్ళలేదు. సత్య మూడురోజులు సోడానీళ్ళు తాగి ఉపవాసాలు చేసింది. మళ్ళీ అటువంటి తప్పు చేయనని దృఢనిశ్చయం చేసుకుంది. నిండైన మనసుతో నూతనోత్సాహంతో ధైర్యంగా ఆఫీసుకు వెళ్ళింది. ఆఫీసులో పని మిగల్చకుండా ఆనాటినుండీ పూర్తిగా చేసుకోగలుగుతున్నది. అదీ గాక ఆమె మనసు మరొకవిధంగా ఆనంద తరంగిత మైనది. మాతృమూర్తిగా తన పిల్లలకు తన ప్రేమానురాగాలు అందిస్తూ పెంచాలని నిశ్చయించుకుంది. పాపం, శరణాలయాలలోని పిల్లలకు ఈ అవకాశం లేకనే కదా ఎవరు ప్రేమతో ఆదరిస్తారా అని బిక్కముఖాలు వేసుకుని ఎదురుచూస్తూ ఉంటారు ? అందుకే నెలకొకరోజయినా శరణాలయాలలోని పిల్లలను ఆదరంగా పిలిచి భోజనాలు పెట్టి ప్రేమతో పలకరించండి' అని విదేశాలలో పత్రికలు గృహస్థులను అర్థిస్తూ ఉంటాయి. విదేశాలలో కలిగిన కుటుంబాలలోని పిల్లలు కూడా తల్లిదండ్రులున్నా ఆప్యాయత నందించి పిల్లలను ఆదరంగా పెంచటానికి వారికి తీరికలేదు. కనుకనే పిల్లలు చిన్నతనంలోనే స్వతంత్రాభిప్రాయాలతో విచ్చలవిడిగా తిరగ గలుగుతున్నారు. స్వతంత్రంగా జీవిస్తున్నారు.

కాని తన పిల్లలో ? తండ్రి అశ్రద్ధచేసినా తల్లీ తండ్రీ తానేఅయి తల్లిగా మమతానురాగాలందిస్తుంది. బాధ్యత గల తల్లిగా వాళ్ళను తీర్చిదిద్దుతుంది. కాని తప్పించుకోవాలని చూడదు.

అందుకే మళ్ళీ అటువంటి తప్పుపని చేయకుండా ఉపవాసాలు చేసింది. తనను తానే శిక్షించుకుంది. 'ఆయన ఉద్యోగం చేస్తున్నాడా ? పిల్లలపని కొంత

యినా చూడకూడదా ?' అని అనుకోవటం లేదు. అనవసరంగా మనసు అలిసిపోయే ఆలోచనలు వదిలిపెట్టి, తన బాధ్యతగా జీవితాన్ని సాగిస్తోంది. కాని ఆయన ఇంటినీ పిల్లల్నీ పట్టించుకోడని ఎవరన్నా అన్నారని తెలిస్తే మాత్రం రోషం వస్తుంది. మనసు చిన్నబోతుంది. జీవితమొక ప్రవాహం లాంటిది. తప్పొ ఒప్పొలను కడుపులో ఉంచుకుంటూ సాగిపోతుంది.